క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : భూభారతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులను తీసుకుంటారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు భూ సమస్యలను వివరంగా తెలియజేయాలని సూచించారు.

అందుబాటులో విత్తనాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం పీఏసీఎస్‌లో వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ ఆదివారం తెలిపారు. బీపీటీ 5204, జేజీఎల్ 27356, ఆర్ఎన్ఆర్, పీకేఏవీ హెచ్ఎంటీ, కేఎన్ఎం, ఎంటీయూ రకాలతో పాటు వేరుశనగ, కంది, పెసర తదితర రకాల విత్తనాలు ఉన్నాయని అవసరమైన రైతులు తీసుకెళ్లాలని సూచించారు.

ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలు



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని 31 ప్రభుత్వ పాఠశాలలకు గాను విద్యార్థులకు మొదటి విడతగా మొత్తం 6,342 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. పుస్తకాలు స్థానిక ఎమ్మార్సీకి చేరాయని, వీటిని పాఠశాలల వారీగా పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ బి. బాలునాయక్ తెలిపారు. మరికొన్ని పాఠ్యపుస్తకాలు ఇంకా రావాల్సి ఉందని చెప్పారు. పాఠశాలల తొలిరోజు నుంచే పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై జీలుగ విత్తనాలు ఇస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో పంపిణీ జరుగుతుందని, 30 కేజీల బస్తాకు రూ.2157.50 చెల్లించాలని, కావాల్సిన రైతులు భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

ధ్యానంతో ప్రశాంతత



అర్వపల్లిలోని ధ్యాన కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న వెంకట రంగారావు

అర్వపల్లి : ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎం. వెంకటరంగారావు కోరారు. అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షకుడు వెంకటయ్య, అభ్యాసీలు వనం రమేష్, మేకల సత్యనారాయణ, మనుబోతుల వీరయ్య, మేకల ఉమారాణి, డి. సతీష్, రాగి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి గణేష్‌కు ఎన్టీఆర్ స్మారక అవార్డు

సూర్యాపేట: గత మూడు దశాబ్దాలుగా మనం వికాస వేదిక ద్వారా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తన స్వీయ రచన ద్వారా చేసిన సాహితీ సేవకు గుర్తింపుగా సూర్యాపేటకు చెందిన సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ ఎన్టీఆర్ స్మారక అవార్డు అందుకున్నారు. విజయవాడకు చెందిన ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ ఎక్సరే ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన తెలుగు రాష్ట్రాల ప్రముఖులకు ఎన్టీఆర్ స్మారక అవార్డులను ప్రదానం చేస్తుంది. అందులో భాగంగా శనివారం రాత్రి విజయవాడలోని సిద్దార్థ కళాశాల ఆవరణలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో పెద్దిరెడ్డి గణేష్ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఎన్టీఆర్ స్మారక అవార్డు అందుకున్నారు. ఎక్సరే ప్రధాన సంపాదకుడు కొల్లూరు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదిరులు పాల్గొని పెద్దిరెడ్డి గణేష్ చేసిన సేవలను కొనియాడారు.



అవార్డు అందుకుంటున్న పెద్దిరెడ్డి గణేష్

సర్కారు బడిలోనే చేర్పించేలా..

- పిల్లల తల్లిదండ్రులకు అవగాహన
- 6నుంచి 9వరకు బడిబాట నిర్వహించేలా అధికారుల కసరత్తు
- పాఠశాలలకు చేరుతున్న యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి(ఫైల్)

పెన్‌పహాడ్ : విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, భోజనం అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. నూతన విద్యా సంవత్సరానికి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక దృష్టిసారించామని ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, కల్పిస్తున్న వసతుల గురించి తెలియజేస్తున్నారు.

6వ తేదీ నుంచి బడిబాట..

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఈ నెల 6 నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభం కానుంది. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలనే ధ్యేయంతో ప్రతి గ్రామంలో బడిబాట ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. 19 వరకు ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీలు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కల్పించనున్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్..

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం ముందే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. మండలంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 2520 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ పుస్తకాలువచ్చాయి. ఆయా పాఠశాలలకు పంపిణీ కూడా జరిగింది. యూనిఫామ్‌లు కూడా పంపిణీ చేశారు.

పాఠశాలలను తెరిపిస్తాం..

అనంతారం, గాజులమల్కాపురం గ్రామాల్లోని ఉర్దూ పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. ఈ విద్య సంవత్సరం ఆ రెండు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి వాటిని తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

అక్షరాస్యులుగా తీర్చదిద్దుతాం



గ్రామాల్లో న్యూ ఇండియా ప్రోగ్రెస్ (ఎన్ఐఎల్‌పీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మధ్యలో చదువుకు దూరమైన వారిని ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తిస్తారు. అందుకు మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లను సమన్వయపరుస్తారు. గుర్తించిన వారందరికీ ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ కోర్సులలో విద్యను అందిస్తారు.

– నకిరేకంటి రవి, ఎంఈఓ

సృజనాత్మకతను వెలికి తీయడానికి శిక్షణ

సూర్యాపేటటౌన్ : సృజనాత్మకతను వెలికి తీయడానికి అక్షర వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉప్పు నాగయ్య అన్నారు. అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏవీఎం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఏవీఎం హైస్కూల్‌లో 30 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో యోగా, ధ్యానం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్ ఓరియంటేషన్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, కరాటే, డ్యాన్స్, మోరల్ స్టోరీస్ వంటి కోర్సులను 650 మంది విద్యార్థులు వినియోగించుకున్నారని తెలిపారు. సమ్మర్ క్యాంపులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రశంసించి అభినందించారు.



శిక్షణ తరగతుల ముగింపులో పాల్గొన్న విద్యార్థులు

ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ కార్యదర్శి రుద్రంగి కాళిదాస్, పాల్వాయి వెంకన్న, సుభాష్ చంద్రబోస్, కొచ్చర్ల గురుచరన్, నాగరాజు, బూర్గుల వెంకట్, సుశ్రిత, రవికుమార్, మహేందర్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తుంగతుర్తిలోని శ్రీ విద్యాభారతి పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి పాఠశాలకు చెందిన 2000- 2001 విద్యా సంవత్సరం పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఎండీ నసీరుద్దీన్, తాళ్లపెల్లి సోమన్న, పందిరి మల్లయ్య, కోట వెంకటగోపాల్, గుండగాని రాములుగౌడ్, గుడిపాటి సైదులు, సుదగాని మల్లేష్, ఆర్.శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు గాజుల నరేష్, బొంకూరి రమేష్, బింగి శ్రీకాంత్, ఉపేంద్ర చారి, పవన్ కుమార్, సైదులు, శ్రవణ్ కుమార్, గుండగాని సరిత, తుమ్మ రాధిక, రచ్చ ఉమ, ప్రేమలత, జలగం స్రవంతి, పంజాల రమేష్, బైరోజు రమేష్, అశ్విని, సురేష్, ఉమేష్, సంతోష్, లింగయ్య, పవన్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత 'అపూర్వ' సమ్మేళనం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుప్పాల వీరన్న, దాసరి శ్రీనివాస్, శ్రీనివాసాచారి, వారాల శ్రీను, యరగాని రమేష్, మిర్యాల లింగారెడ్డి, సత్యనారాయణచారి, పోతులూరి, అజ్మత్ హుస్సేన్, సోమిరెడ్డి విజయలక్ష్మి, స్వరూప, ఉపేంద్ర, సుకన్య, సుధా, మల్లారెడ్డి, జాన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న ఆత్మకూర్(ఎస్) జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి పోరాడాలి



మాట్లాడుతున్న బద్దం క్రిష్ణారెడ్డి

చివ్వెంల : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల 15వ మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత పాలకులు ప్రజాసమస్యలు విస్మరించారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మతాల పేరుతో చిచ్చు పెట్టే ప్రధాని మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జూన్ 8న జరిగే జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో మూడవసారి మండల కేంద్రానికి చెందిన ఖమ్మంపాటి రాము మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, రెగట్టి లింగయ్య, సోంపంగి సతీష్, ఐతరాజు లింగయ్య, రామలింగం, సతీష్, వెంకటేష్, నాగమణి, వెంకన్న, సైదులు, సత్యమ్మ, మల్లేశ్వరి, రాము తదితరుల పాల్గొన్నారు.

3నుంచి సదస్సులు

మోతె : మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈ నెల 13 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకన్న ఆదివారం ప్రకటనలో కోరారు. 3న కూడలి, అన్నారిగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న సర్వారం, నేరడవాయి, 5న బుర్కచర్ల, తుమ్మలపల్లి, 6న సిరికొండ, విభళాపురం, 9న నామవరం, హుస్సేన్‌బాద్, 10న రాఘవాపురం, మామిళ్లగూడెం, 11న మోతె, ఉర్లుగొండ, 12న రావిపహాడ్, సింగరేణిపల్లె, 13న గోపతండాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి

మునగాల : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. ఆదివారం ఆయన మునగాల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల వల్ల మానవ జాతికి క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందని, ఎంతో మంది క్యాన్సర్ భూతానికి బలైపోతున్నారని తెలిపారు. దుకాణాల్లో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి జూట్ బ్యాగులు, గోనె సంచులు వాడేలా చూడాలని కోరారు. ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా అమలు పరచాలని డిమాండ్ చేశారు.

పదవీ విరమణ పొందిన హెచ్ఎంకు సన్మానం



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు వెన్న ఊర్మిళను ఆదివారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధారాసింగ్ మాట్లాడారు. ప్రతిప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ పొందుతారని, కానీ ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థులు ప్రయోజకులైనప్పుడే పదవీ విరమణ పొందినట్లుగా భావిస్తారని అన్నారు. ఊర్మిళ నిబద్ధతతో పనిచేస్తూ ప్రతిచోట మంచి పేరు తెచ్చుకున్నారని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి ఎంఈఓ బాలు నాయక్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రవణ్ కుమార్, జి.వెంకటయ్య, పి.శ్రీహరి, ఎండీ బాసిత్, తంగెళ్ల వాసుదేవరెడ్డి, వనజ, జగన్, రమేష్, చౌదర్ రెడ్డి, సురేందర్, డీటీఎఫ్ జిల్లా అధ్యడు పబ్బతి వెంకటేశ్వర్లు, పున్నయ్య, వాంకుడోత్ వెంకన్న, కరుణాకర్ రెడ్డి, చంద్రబోస్, వెంకయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం, ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, ఇంద్రారెడ్డి, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనుపాండే, శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



నాగారం : పసునూర్‌లో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్నేహితులు



అర్వపల్లి : స్నేహితుడి కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు



నూతనకల్ : ఆర్థికసాయం చేస్తున్న మిత్రబృందం

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన వేర్పుల రజిత భర్త వేర్పుల సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా పసునూర్ జెడ్పీహెచ్ఎస్ 2001-2002 టెన్త్‌బ్యాచ్‌కు చెందిన రజిత స్నేహితులు ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.40,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజుల అశోక్, అంజి, రవి, నరేష్, సోమలింగం, సతీష్, అంజయ్య, మాధవి, ఇందిర, శశికళ, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

నూతనకల్ : ఆత్మకూరు మండలం కొత్తగూడెం గ్రామంలో అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి తన చిన్న నాటి స్నేహితులు అండగా నిలిచి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండలానికి చెందిన తిప్పర్తి అనిల్ నూతనకల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010లో పదవ తరగతి పూర్తిచేశాడు. ఇటీవల అనిల్ అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలుసుకున్న స్నేహితులు అందరూ కలిసి రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో 2010 బ్యాచ్ పదవ తరగతి మిత్రులు పాల్గొన్నారు.

తోటి స్నేహితుడి కుటుంబానికి చేయూత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కుంచమర్తి గ్రామానికి చెందిన కొత్త రాజుయాదవ్ ఇటీవల మృతి చెందారు. దీంతో అర్వపల్లిలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-2004 విద్యాసంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం తమవంతు సాయంగా రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు స్నేహితులు, కుటుంబీకులు పాల్గొన్నారు.

అర్వపల్లి కేజీబీవీలో 'ఇంటర్' విద్య



అర్వపల్లిలోని కేజీబీవీ



బాలికకు అడ్మిషన్ ఇస్తున్న సిబ్బంది

- ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రారంభం
- అందుబాటులో ఎంపీసీ, బైపీసీ కోర్సులు

అర్వపల్లి : ఎట్టకేలకు అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇక్కడి కేజీబీవీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రారంభం అయ్యింది. కేజీబీవీని కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో అధికారులను కోరుతున్నారు. అయితే ప్రస్తుతం ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ కావడంతో కేజీబీవీ సిబ్బంది బాలికల అడ్మిషన్ల కోసం ఊరూరు తిరిగి ప్రచారం చేస్తున్నారు.

రెండు గ్రూపులలో 80 సీట్లు..

అర్వపల్లి కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లను ప్రారంభిస్తున్నారు. ఒక్కో గ్రూప్‌కు 40సీట్లు మంజూరయ్యాయి. మొత్తం 80 మంది బాలికలు రెండు గ్రూపులలో ఇంటర్ మొదటి సంవత్సరం నందు విద్యను అభ్యసించనున్నారు. కాగా టెన్త్‌లో ఈసారి ఈ కేజీబీవీలో 43మంది బాలికలకు గాను అందరూ ఉత్తీర్ణులయ్యారు.

దరఖాస్తులు చేసుకోవాలి



అర్వపల్లిలోని కేజీబీవీ ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. మొదటి సంవత్సరం నందు విద్యనభ్యసించే అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలి. అడ్మిషన్ల కోసం గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నాం. మొత్తం 80సీట్లు ఉన్నాయి.

– నాగరాణి, కేజీబీవీ ఎస్ఓ

పిచ్చమ్మకు నివాళి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క బాలయ్య భార్య పిచ్చమ్మ (55) ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలయ్యను ఓదార్చారు. ఆయన వెంట స్థానిక మాజీ సర్పంచ్ దున్నా సుధాకర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ.జలీల్, నక్క గంగరాజు, నక్క సైదులు, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలి



ప్రచారజాతా సందర్భంగా మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోంబాబు

అర్వపల్లి : మన పిల్లలను మన ఊరిలోని ప్రభుత్వ బడిలో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సోంబాబు కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ఆదివారం అర్వపల్లిలో ప్రచారజాత నిర్వహించి మాట్లాడారు. ప్రజల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు ఆదాం, వి.రమేష్, సీహెచ్.రమేష్, వెంకటయ్య, మండల ప్రతి నిధులు నోముల వెంకటేశ్వర్లు, నల్లగంటి వెంకన్న, కోటమర్తి వీరన్న పాల్గొన్నారు.

ఆచార్యులగూడెం వాసికి గౌరవ డాక్టరేట్

చిలుకూరు: మండలంలోని ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన ఆలోచన ఫౌండేషన్ చైర్మన్ ములుగూరి నాగరాజుకు అమెరికాకు చెందిన డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఇండియాకు సంబంధించిన చాన్సలర్ డాక్టర్ జేమ్స్ ఆమోస్, డాక్టర్ శిరీషారెడ్డి.. నాగరాజుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, ఆలోచన ఫౌండేషన్ పేరుతో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నందుకుగాను యూనివర్సిటీ తనకు గౌరవ డాక్టరేట్ అందజేసినట్లు నాగరాజు తెలిపారు. నాగరాజుకు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల గ్రామస్తులు, మండలవాసులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న నాగరాజు

వైభవంగా గంగదేవమ్మ పండుగ



ఊరేగింపుగా వెళ్తున్న యాదవభక్తులు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో యాదవుల ఆరాధ్యదైవమైన గంగదేవమ్మ పండుగను ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు గంగదేవమ్మ అమ్మవారికి డప్పుచప్పుళ్లతో గ్రామంలోని పురవీధుల గుండగా ఊరేగింపు నిర్వహించారు. అలాగే అమ్మవారికి బోనాలు, నైవేద్యం, టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ శిక్షణ శిబిరం



జిల్లా స్థాయి వాలీబాల్ శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా యువజన క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో బిగ్‌హెల్ప్ సంస్థ ఆర్థిక సహకారంతో నెలరోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం 85మంది బాలబాలికలు,యువకులు శిక్షణ పొందారు. చివరిరోజు వారిని క్యాంప్ ఇన్‌చార్జ్, పీడీ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.మల్లేష్ అభినందించారు. ఈ శిబిరంలో వాలీబాల్‌ను ఎంతో ఉత్సాహంగా నేర్చుకున్నట్లు క్రీడాకారులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ మేకల సునీత రాంబాబు, ఉపాధ్యాయుడు వీరన్న పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

నేరేడుచర్ల : ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని భారత వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు పద్మావతి, మానస అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. పంటల ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పురాతన పద్ధతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేయడం ద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, కవిరాజు, ఫీల్డ్ ఆఫీసర్ శరత్, ఏఓ జావీద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.